# ఎవరికి వారే

తెల్లవారు ఝామునే తూర్పు దిక్కున దట్టంగా పట్టిన నల్లటి మబ్బులని దాటుకుంటూ శ్రావణమాసం సూర్యుడు ఆకాశం మీద కనిపించాడు. ప్రతిరోజూ లాగానే హరిదాసు రంగయ్య తొలికోడి కూయగానే నిద్దర లేచి నదిలో స్నానం చేసి మడి నీళ్ళు రాగి చెంబులో నింపుకుని రంగనాయకులు గుడి కోనేరు మెట్ల మీద కూర్చున్నాడు. యథావిధిగా గాయత్రి నూట ఎనిమిదిసార్లు పూర్తిచేసి, కృష్ణార్పణం అనుకుని కళ్ళు తెరిచేసరికి కట్టెలు కొట్టు కాంతయ్య నవగ్రహాలకు తొమ్మిది ప్రదక్షిణాలు పూర్తిచేసి గుళ్లో దేముడికి దండం పెట్టుకుంటూ - "ఈ సంవత్సరమన్నా మా ఇంట్లో ఉయ్యాల తొట్టె వేయించు స్వామీ! నీ దర్శనం కోసం శ్రీరంగం వస్తాము" అని రోజు లాగానే మళ్ళీ మొక్కుకున్నాడు.

మొదటి ఇద్దరు భార్యలు నిస్సంతుగానే పోవడం, ఈ మూడో పెళ్ళామన్నా ఆ ముచ్చట తీరుస్తుందేమో ననుకుంటే పుష్కరం దాటినా ఆవిడ ఆ ప్రయత్నంలో లేదు. తను 'హరీ' మని అంటే ఇంత ఆస్తీ కుక్కల నక్కల పాలవడమే కాకుండా తనకూ తన పెద్దలకూ పున్నామనరకం తప్పదు. ఈ బెంగ తనని ఇరవై నాలుగు గంటలు వేదిస్తోంది.... మూడు పదులు ముప్ఫై సంవత్సరాలుగా తను ఈ రంగనాధుడిని మనసారా ప్రార్థిస్తున్నాడు. కాని ఆయన తన మొరాలకించడం లేదు. కోరిన వరం ఇవ్వటంలేదు. అందుకనే మరీ ఒక్కొక్కసారి ప్రాణం విసిగినప్పుడు అనిపించేది.... ఈ కలియుగంలో దైవం కూడా మంచివారి మొర ఆలకించడంలేదని వాపోయేవాడు. వాపోయినా దైవ స్మరణ మానలేదు. ఆయుర్వేదం మందులు తినడం మానలేదు.

ఒకటి రెండుసార్లు తనగోడు హరిదాసు రంగయ్యతో చెప్పుకున్నాడు. రంగయ్య బిగ్గరగా నవ్వాడు. చివరకు ఒకనాడు ఏకతార మీటుతూ,

"పెట్టు వారికే పుట్టేదన్నా పెట్టిందే నీ పెట్టుబడన్నా
పెట్టి పోయని పుట్టులోభికి
పుట్టగతే లేదన్నా!"

కాంతయ్యకు జ్ఞానోదయం కాలేదు సరికదా వల్లమాలిన కోపం వచ్చింది. సంతానం విషయం ఈ సన్నాసులకి ఏం తెలుస్తుంది? తెలిసిన వాళ్లని ఆశ్రయిస్తే మంచిదని గుడికి ఈశాన్యదిక్కు సందులో వున్న పరాత్పరరావుగారి ఇంటికి వెళ్ళాడు.

రావుగారు వృత్తికి కుటుంబ నియంత్రణ డాక్టరుగారైనా, స్వవిషయంలో మాత్రం సంతాన గోపాలుడు. సంతానానికి సప్తఋషుల పేర్లతో ప్రారంభించి, అవి సరిపోక నక్షత్ర మండలం మీదకు పోయాడు. అశ్వనీ భరణి అంటూ మొదలు పెట్టి ప్రస్తుతం పునర్వసుదాకా వచ్చాడు.

అంత ఆత్మవిశ్వాసం, గుండె ధైర్యం కల వ్యక్తులు లక్షకు ఒకరో ఇద్దరో ఉంటారేమో!

ఆయన వేదాంతం, 'నారుపోసిన దేముడు నీరు పోయడా' అని. ఆయన ఇల్లాలి వేదాంతం, 'తీవెకు కాయలు బరువా?'

ఆయన్ను ఆశ్రయిస్తే తనను దరిజేరుస్తాడని నమ్మకంతో కాంతయ్య ఒక రోజు సాయంకాలం ఆయన ఇంటికి వెళ్ళాడు. పెద్దవాళ్ళని చూడటానికి వెళ్ళేటప్పుడు వుత్త చేతులతో వెళ్ళకూడదని వీశెడు మంచి నెయ్యి, అర్ధమణుగు తీపి మిఠాయి, ఇంట్లో వాడుకొనడం కోసమని బాగా ఎండిన సరుకు పేళ్ళు రెండు బళ్ళు పంపించాడు. అసురసంధ్య వేళలో పేషెంట్లు ఎవ్వరూ లేని సమయంలో తన గోడు చెప్పుకున్నాడు.

ఆయన కాంతయ్య చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు. మిఠాయి పిల్లలకు పంచిపెట్టాడు. నెయ్యి అల్యూమినియం డబ్బాలో పోసి నేతి చెంబు తిరిగి ఇచ్చి వేశాడు. దొడ్లో ఎండ బాగా వచ్చేచోట కట్టెలు ఒకలాటుగా పేర్పించాడు. చివరకు కాంతయ్య వంక తిరిగి చిరునవ్వు నవ్వాడు. కాంతయ్య చేతులు జోడించి, గద్గద స్వరంతో "డాక్టరుగారు, మీరే ఏదో సులువు నేర్పి నా వంశం నిలబెట్టాలి" అని అన్నాడు.

డాక్టరుగారు అనంతంలోకి చూస్తూ చిన్మయ ముద్ర ఘటించి "పక్షులకి ఎగరటం, చేపలకి యీదటం ఎవరు నేర్పారు? ఇది కూడా అంతే... 'క్రియా సిద్ధిర్ సత్వేభవతి' పురుష ప్రయత్నం త్రికరణ శుద్ధిగా చేస్తే దైవం కోరిన వరం ఇస్తాడు."

కాంతయ్యకు ఈసారి నిజంగానే కోపం వచ్చింది. చేపలు ఈదటానికి, పక్షులు ఎగరటానికి, తన యింట్లో సంతానం కలగటానికి గల సంబంధం ఏమిటో తెలియలేదు. డాక్టరుగారు తనని ఎద్దేవా చేస్తున్నట్టు, ఈ మాత్రం కూడా చాతకాదా అని హేళన చేస్తున్నట్టు అనిపించింది. తనని వాజమ్మ క్రింద జమకట్టినంత బాధ కలిగింది.... ఉన్నట్టుండి బ్లడ్ ప్రెషర్ పెరిగింది.... "ఏం మాట్లాడుతున్నాడో తెలియటం లేదు. పధ్నాలుగురు పిల్లలున్నారని మహా మిడిసిపడుతున్నావు. నీకే కాదు కీలెరిగి వాత పెట్టడం నాకూ తెలుసు" అని అన్నాడు.

డాక్టరుగారు మామూలుగానే నవ్వి "ఐతే వాత పెట్టుకో" అని అన్నాడు. కాంతయ్య దుర్వాసుడిలాగా లేవబోతుంటే డాక్టరుగారు ఇంకా నవ్వుతూనే "ఉప్పు, కారం తగ్గించి అన్నం ఎక్కువ తినడం నేర్చుకో. ప్రెషర్ తగ్గితేనే ప్లెషరు."

ఇహ అక్కడ ఒక్క క్షణం కూడా కాంతయ్య నిలవలేదు. సరాసరి రక్షణ వీధిలోవున్న ధర్మయ్య ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఇసుక వేస్తే రాలకుండా జనం వున్నారు. వాళ్ళ మధ్యలో వూపిరి పీల్చుకొనడానికి కూడా తీరిక లేనంత హడావిడిగా ధర్మయ్య కూర్చుని వున్నాడు. నల్లటి శరీరం, తెల్లటి జుట్టు, ఎర్రటి కళ్లు, వంటినిండా ఎక్కడా ఖాళీ లేకుండా పట్టెనామాలు, మాటి మాటికి 'రంగా కావేటి రంగా' అంటూ రంకెలు. కాంతయ్యను చూడగానే జనం దోవ యిచ్చారు. ధర్మయ్య కంటపడగానే, కాంతయ్య పై ఉత్తరీయం తీసి నడుముకి కట్టుకుని దండం పెట్టి నుంచున్నాడు. ధర్మయ్య అలవాటుగా 'రంగా కావేటి రంగా' అని రంకెపెట్టి "ఏం కాంతయ్యా! నాకు కూడా తడి కట్టెలే పంపుతున్నావే. ఆ మహా యిల్లాలు పొగతో నానా బాధ పడుతోంది" అని చిరునవ్వుగా అన్నాడు.

ఎవరన్నా మాట అంటే పడే పరిస్థితిలో లేడు కాంతయ్య. వచ్చిన పని మరిచిపోయి, "వానాకాలంలో ఎండు కట్టెలు ఎల్లా వస్తాయి? కట్టెలు తడవకుండా ఒక లా ప్యాసు చేయించండి" అని అన్నాడు.

ధర్మయ్య పెద్దపెట్టున నవ్వి, "అసెంబ్లీ సెషన్సు ప్రారంభం కాని, ఒకటేమిటి పది యాక్టులు ప్యాసు చేయిద్దాం? ఇంతకూ మంచి కాకమీద వున్నావు. ఇంట్లో ఏమన్నా విశేషమా?" అని అడిగాడు.

కాంతయ్యకు కళ్ళ నీళ్ళు తిరిగాయి. "మీరు కూడా నలుగురితోపాటు అయితే ఎలా?" అని అన్నాడు.

"ఇంతకూ అసలేం జరిగింది కాంతయ్య బావా?"

"నా వళ్ళు మండుకుపోతుంది."

"దానికి మందుంది. రా లోపలికి వెడదాం" అంటూ కుర్చీలోంచి లేస్తూ వచ్చిన జనంతో,

"రంగా కావేటి రంగా! ఒక దెబ్బకు ముప్పై మూడు పిట్టలు" అని అన్నాడు. వచ్చిన జనం అర్థం కానట్టు చూశారు.

ఈ భూమి మీద జన్మించిన మానవుడికి మరణం ఒక్కసారే వస్తుంది. ఆయుస్సు తీరినా, ఆత్మహత్య చేసుకున్నా, ఒకడు చంపినా, ముప్పైముగ్గురు కలిసి చంపినా మరణం మరణమే!

జూదంలో మోసం చేశాడని మాలవెంకటిని, తాగి ఒళ్ళు తెలియని మైకంలో మాదిగ వీరన్న చంపాడని ప్రతిపక్షం వారు చేస్తున్న ప్రచారం నూటికి నూరుపాళ్ళు అబద్ధం.... అని మనం అంటున్నాం. హరిజనులని ద్వేషించే బూర్జువాల వర్గం లోని ముప్తై ముగ్గురు మూకవుమ్మడిగా దొమ్మీచేసి, పట్టపగలు, నడివీధిలో, నిర్దాక్షిణ్యంగా చంపివేశారని మన వాదం. అందుకు మనమంతా అరవై ఆరు మంది ప్రత్యక్ష సాక్షులం వున్నాం... కాని... ఈ కాలంలో డబ్బు లేకుండా ఏ పనీ జరగటం లేదు... అన్నీ ఖరీదు పెరిగిపోతున్నాయి. న్యాయం కూడా డబ్బు ఖర్చు పెడితేనే కాని దొరకటం లేదు. కసాయివాళ్ళ చేతుల్లో బలి అయిపోయిన మన సోదరుడి ఆత్మకు శాంతి లభించాలంటే, ఆ వూళ్ళో మనం ధైర్యంగా నిలబడాలంటే, మనుష్యుల్లాగా బ్రతకాలంటే మనం కష్టపడక తప్పదు. త్యాగాలు చెయ్యక తప్పదు. కనీసం పది వేలైనా లేందే మీ యజ్ఞం పూర్తికాదు. నేను రెండు వేలు ఇవ్వడానికి సిద్ధంగా వున్నాను. మీ గ్రామంలోని ప్రతి పురుషుడు, స్త్రీ, బాలుడు ఒకరోజు కూలి సాటి మానవుడి కోసం దానం చెయ్యండి. డబ్బు చేకూరగానే మనం పని ప్రారంభించుదాం...

"రంగా! కావేటి రంగా!" అంటూ పొలికేక పెట్టాడు. జనం సంతోషంగా వెళ్లిపోయారు. కాంతయ్య, ధర్మయ్య మిగిలారు.

ధర్మయ్య నిట్టూర్పు విడిచి, "ఎటువంటి అన్యాయాలు జరుగుతున్నాయో చూస్తున్నావుగా కాంతయ్యా! లోకం బొత్తిగా చెడిపోతోందయ్యా... ధర్మం ఏ కోశానా లేదు. ఇంతకూ నువ్వు వచ్చిన పనేమిటో చెప్పావుకాదు."

"చేస్తానంటే చెబుతా!"

"నాకు సాధ్యమైన పనైతే తప్పకుండా చేస్తాను కాదటయ్యా! ఆ కావేటి రంగడు, విస్కీ రెండో రౌండు త్రాగుతూ వుండగా ఆ కస్తూరి రంగడు, నన్ను ఈ వూరికి తీసుకువచ్చింది మీ అందరికీ సేవ చెయ్యడానికే కాదుటయ్యా!"

ముప్తై సంవత్సరాల క్రితం ధర్మయ్య కట్టుబట్టలతో ఈ వూరు వచ్చాడు. అతనిది ఏ ఊరో, అతని అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు. ఒకరిద్దరు ఆరా తీయబోతే అతను చిరునవ్వు నవ్వి "గాలిది ఏ వూరో నాదీ అదే ఊరు, దైవానిది ఏ పేరో నాదీ అదే పేరు" అని అన్నాడు.

ఒకనాటి రాత్రి వానలో తడిసి చలికి గజగజ వణికిపోతున్న ఒక బాటసారికి తన పై బట్ట తీసి కప్పాడు. జేబులో వున్న బేడ డబ్బులు పెట్టి వేడి వేడి టీ ఇప్పించాడు. ఉపకారం పొందిన ఆ దానయ్య తన దారిన పోతూ ఇతన్ని మనసారా దీవించి "బాబు నువ్వు ధర్మయ్యవి" అని అన్నాడు. ఆ మాట టీ కొట్టు నాయరు

విన్నాడు. అతనూ ఆ పేరే ఖాయం చేశాడు. కాలం పదేళ్ళు గడిచేసరికి ధర్మయ్య అందరినోట్లో నాలుక అవటమే కాదు, ఆ ఊళ్ళో మొనగాళ్ళకు మొనగాడయ్యాడు. అతను చెయ్యని నిర్వాహకం లేదు. కలిపించుకోని వ్యవహారం లేదు. మరో పదేళ్ళయ్యేసరికి అతని పేరు ఆ వూరు వదిలి జిల్లామీద పడింది. ఆ మొఖాసాకు దీటైన నాయకుడు ఎవరయ్యా అంటే ధర్మయ్యేనని అంతా అన్నారు. పోటీ లేకుండా వీలైనన్ని పదవులు, బరువులు, బాధ్యతలు కట్టపెట్టారు.

తోటివాళ్ళమాట కాదనలేక కనికరం కొద్దీ 'రంగా! కావేటి రంగా' అంటూ రంకెలు పెడుతూనే ఈ బాధ్యతలన్నీ తలకెత్తుకున్నాడు. ఆదిశేషుడిలాగా ఈ భూభారాన్ని తను ఒక్కడే మోస్తున్నాడు. ఇంకొక పది సంవత్సరాలు గడిచేసరికి దక్షిణ వీధిలోని యిళ్ళన్నీ అతనివే. ప్రజలకు ఉపయోగంగా వుంటుందని రెండు రైసుమిల్లులు, ఒక సినిమాహాలు, నాలుగైదు లారీలు వగైరా సంపాదించక తప్పలేదు. అది ఏమి ఛాందసమో ఇంత సిరి వద్దన్నా వచ్చిపడుతున్నా అతగాడి వేషభాషలలో కాని ఫాయాలో కాని ఏ మార్పు రాలేదు. వచ్చిన మార్పల్లా దేశ పరిస్థితులని తలుచుకుని దేశం చెడిపోతోందే, ధర్మం నాలుగు పాదాల నడవటంలేదనే బాధ కలిగినప్పుడు, సీసా స్కాచ్ విస్కీ సేవించటం.

యోగ్యుడైన వరుడు, ముందూ వెనుకా కూడా ఎవ్వరూ వున్నట్టు లేరు అని దయతలచి కులగోత్రం విచారించకుండా ఎంతో మంది అతనిని ఒక యింటివాడిని చెయ్యడానికి శాయశక్తులా ప్రయత్నం చేశారు.

"మీ అందరికీ నేనంటే ఎందుకింత కోపం. నేను ఇక్కడ వుండటం ఇష్టం లేకపోతే చెప్పండి. నాదోవను నేను చక్కాపోతాను" అని ధర్మయ్య బెదిరించే సరికి అందరూ ఆ ప్రయత్నం మానుకున్నారు. ఒకరిద్దరు గిట్టని వాళ్లు మాత్రం పట్టణంలోని రంగసాని మనుమరాళ్లు యిద్దరు ఈయన ప్రాపకంలోనే వున్నారని ప్రచారం చెయ్యబోయేసరికి, వాళ్ళకు ఎన్నడూ వూహించని కష్టాలు ఒకదాని వెంట ఒకటి రావటంతో వాళ్ళు శరణార్థులుగా అన్యప్రాంతాలకి వలసపోవడం అప్పుడెప్పుడో జరిగింది. వంటకూ, వార్పుకని ఒక మొగ మనిషిని ఇంట్లో వుంచుకున్నాడు. వాడు రవ్వంత ఆడంగిరేకుల వాడు అయ్యేసరికి పరాసికంగా ధర్మయ్యగారు వాడిని గురించి అందరితో 'మా మహా ఇల్లాలు' అని చెబుతూ వుంటాడు. వాడూ నిజమేనన్నంత ఇదిగా సిగ్గుపడుతూ వుంటాడు.

విస్కీ రెండో రౌండు త్రాగుతూ వుండగా కాంతయ్య అసలు విషయం చెప్పాడు. "తనకేకదా అంతమంది పిల్లలున్నారని మహా గర్వపడుతున్నాడు. పరాత్పరరావుకు శాస్తి చెయ్యవలసిందే" అని అన్నాడు.

ధర్మయ్య పక్కున నవ్వాడు. "నేను సీరియస్ విషయం చెబితే నవ్వుతారేం?' అని కాంతయ్య కోపంగానే అడిగాడు.

"మనం మళ్ళీ చెయ్యడం దేనికి, డాక్టరుకు ప్రతి సంవత్సరం శాస్తి అవుతోందిగా" అని ధర్మయ్య అన్నాడు.

"కట్టెలు అమ్ముకుని బ్రతికేవాడిని నాకు మీ రాజకీయ వాక్యాలు అర్థంకావు. తెలిసే లాగా చెప్పండి" అని కాంతయ్య అన్నాడు.

"ఆ పిచ్చివాడు అంతా తన నిర్వాహకమే అని అనుకుంటున్నాడు. ఆ మహా యిల్లాలు ముగ్గురు ద్రౌపదుల వద్దు."

"అంటే!" అని కాంతయ్య అడిగాడు.

"పద్నాలుగురు పిల్లలు పద్నాలుగు పోలికలుగా ఎందుకున్నారో డాక్టరుగారికి తెలియకపోయినా వూళ్ళో అందరికీ తెలుసు."

"నిజం?"

"కాకపోతే అబద్ధమా? డాక్టరు బ్రతక నేర్చినవాడు. శ్రమ ఎవరిదైతేనేం? పంట మనదేగదా అని అతగాడి సంతృప్తి. మనం కూడా ఇటువంటి విషయాలలో అంటీ ముట్టకుండా వుండాలి. పిచ్చిక ఎదురు తిరుగునప్పుడే బ్రహ్మాస్త్రము ప్రయోగించాలి."

"నా విషయం ఏం చెయ్యమంటావు ధర్మయ్యా! నా వంశం నిలిచేదెల్లా?"

భూలోకంలో మనుష్యులని నేను స్వర్గానికి పంపించగలను. కాని అక్కడి వాళ్లని ఇక్కడికి రప్పించలేను. ఇటువంటి విషయాలలో మనల్ని దైవం చల్లగా చూడాలంటే ఏ స్వాములవారి పాదాలమీదన్నా పోయిపడు. ఆయనే ఏదో దారి చూపుతాడు."

"అంతేనంటావా?"

"అంతే కాంతయ్యా! రంగా కావేటి రంగా" అంటూ ధర్మయ్య రంకె పెట్టగానే ఆ ఇంటర్వ్యూ అక్కడికి పూర్తి అయింది.

ఈసారి ఎవరిమీద కోపం తెచ్చుకోవాలో కాంతయ్యకు తెలియలేదు.

సరాసరి ఇంటికి వచ్చేసరికి భార్య సుశీల ఎదురుగా వచ్చింది. "ఇవ్వాళ యింకొక క్రొత్త క్యాలెండరు వచ్చిందండోయ్" అంటూ భర్తకు చూపించింది. ఇల్లంతా ఎక్కడ చూసినా పాపాయి బొమ్మల క్యాలండరులే. పసిపిల్లని ఒడిలో కూర్చోబెట్టుకుని పాలు ఇస్తున్న తల్లి బొమ్మ–

కాంతయ్య ఆ బొమ్మలన్నింటి వంకా ఒక్కసారి చూశాడు. ఎంతో దిగులు వేసింది.

"ఈ పాప పేరేమిటో తెలుసా?" అని సుశీల అంది.

"నువ్వు చెప్పలేదుగా" అని కాంతయ్య అన్నాడు.

"ఈ పాప పేరు గాంధారి బాగుందా...."

"బాగుంది" అని భార్యవంక చూసి ప్రయత్నం చేసి చిరునవ్వు నవ్వాడు.

"పట్టణం వెడదాం బయలుదేరు" అని అన్నాడు.

"దేనికి?"

"ఎవరో స్వాములవారు వచ్చారట. చూసివద్దాం" అని అన్నాడు.

"ఎందుకూ" అని అడిగింది.

కాంతయ్య తడబడుతూ "అందుకే" అని అన్నాడు.

ఆవిడ హేళనగా చూస్తూ "మీ పిచ్చిగాని మంత్రాలకి చింతకాయలు రాలుతాయా?"

"అంటే?"

"నేను స్వాములవారి దర్శనానికి రాను" అంది.

"నువ్వు రాకపోయినా నేను వెళ్ళి వస్తాను."

కాంతయ్య సరాసరి తన కట్టెల అడితీ దగ్గర ప్రక్క సందులో వున్న చిన్న పెంకుటింటిలోకి వెళ్ళాడు.

"చంద్రం" అని పిలిచాడు. ఒక బక్కపలచటి కుర్రవాడు బయటకు వచ్చాడు."

"నేను ఈ పూట పట్టణం వెడుతున్నాను. ప్రొద్దున్నే వస్తాను. పెందరాళే దుకాణం తెరు. నేను ఒక అడుగు ఆలస్యంగా వస్తానేమో, వ్యాపారం చూసుకుంటూ వుండు" అని అన్నాడు.

ఆ కుర్రవాడు "సరేనండి" అని అన్నాడు.

"రోజులు బాగాలేవు. జాగ్రత్త! వెయ్యి కళ్ళతో కనిపెట్టి చూసుకుంటూ వుండు" అంటూ కాంతయ్య మరోసారి హెచ్చరించి బయలుదేరాడు.

కుర్రవాడు తలుపు వేసుకుని లోపలికి వచ్చాడు. క్రొత్తగా కాపురానికి వచ్చిన భార్య జానకి వంక చూశాడు. ఉన్న ఒక్క ప్యాంటు, చొక్కా అవే పెళ్లిలో పెట్టినవి, వంకెకు తగిలించాడు. రిస్టు వాచి తీసి ఇంకొక మేకుకు తగిలించాడు.

మలబారు లుంగి, నేతగుడ్డ లాల్చి వేసుకుని భోజనానికి కూర్చున్నాడు.

రెండు చిన్న వుల్లిపాయలు, ఒక పచ్చి మిరపకాయ, రవ్వంత ఉప్పు, ఒక అన్నం కరడుపెట్టి, పలచటి మజ్జిగ పోస్తూ "జీతం వచ్చేదాకా ఇవే పంచభక్ష్య పరమాన్నాలు" అని అతగాడి ఇల్లాలు అంది.

సినిమా డైలాగు గుర్తుకు తెచ్చుకుని ఆ కుర్రవాడు "నీ చేత్తో ఏది పెట్టినా పంచభక్ష్య పరమాన్నాలుగానే ఉంటుంది" అని అన్నాడు.

చిన్నదాని ముఖం ఆనందంతో కెంపు వన్నె కొచ్చింది. వాలుజడ ముందుకు వేసుకుని ఆ చిన్నవాడి వంక క్రీగంట చూస్తూ, ప్రేమగానే చిలిపిగా,

"అన్నీ అబద్ధాలు" అని అంది.

ఆకాశంలోంచి చూస్తున్న స్వర్గీయ సినిమా డైరెక్టరు ఆ సీను అంతటితో 'కట్' అని అన్నారు.

పట్టణం చేరగానే ఎక్కడా ఆగకుండా కాంతయ్య సరాసరి స్వాములవారి దర్శనానికి వెళ్లాడు.... పండు, ఫలం, దక్షిణ సమర్పించుకున్నాడు. తన విషాద గాథ పద్దెనిమిది రీళ్లుగా చెప్పుకున్నాడు.

స్వాములవారు చిరునవ్వు నవ్వలేదు. హేళన చెయ్యలేదు.... ఈ సమస్యని గురించి గంభీరంగానే ఆలోచించారు.

"శాస్త్రంలో అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పివుంచారు నాయనా! కాలం మారినా సమస్యలు మారలేదు. పూర్వమంత బాహాటంగా కాకపోయినా ఈనాడు కూడా వాటిని గోప్యంగా ఆచరించి మనం సత్ఫలితం పొందవచ్చు.... నువ్వు అన్నీ తెలిసినవాడివి. వంశం నిలబెట్టుకోవడానికి ఎన్నో ఉపాయాలు చెప్పారు. దత్తత స్వీకారం చేయవచ్చు...."

"పరాయివాళ్ళ బిడ్డనా?"

"కాదంటే భారతం మళ్ళీ ఒక్కసారి చదువు. ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు ఎల్లా పుట్టారో తెలుసుకో. ఆపైన మీ దంపతులు ఇద్దరికి ఎల్లా ఇష్టమైతే అల్లా చెయ్యవచ్చు."

కట్టెలు అమ్ముకునే కాంతయ్యకు భారతంలో ఈ ఘట్టమేమిటో అర్థం కాలేదు. కాని అడిగే ధైర్యం లేక నిరాశతో ఇంటికి తిరిగి వచ్చాడు.

ఇంటికి రాగానే భార్య ఇంకొక క్రొత్త క్యాలెండరు తీసుకువచ్చి చూపించ బోయింది. ఒక కుక్క మూడు పిల్లలు. వాటి వంక చూడకుండా కాంతయ్య ఒకటే ప్రశ్న వేశాడు.

"ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు ఎల్లా పుట్టారు?"

ఆవిడ నిర్ఘాంతపోయి ఒక్కక్షణం చూసింది... అంతలోనే తెప్పరిల్లుకుని కోపంగా "త్రాగటం కూడా నేర్చుకున్నారా?" అని అడిగింది.

కాంతయ్య నసుగుతూ "మరేమో... మరేమో... స్వాములవారు అడిగారే?" అని అన్నాడు. ఆవిడ పక్కున నవ్వి "ఆయనెవరో మనంత మూర్ఖుడే అయి వుండాలి... అయినా ఎవరెల్లా పుడితే మనకెందుకు?"

ఎడ మొహం, పెడ మొహంగా ఆ రాత్రి తెల్లవారింది. తెల్లవారినా మబ్బుచాటు సూర్యుడు గుడి గోపురం మీదికి రాలేదు. ఎవరిదో ఏడుపు విని పరాత్పరరావు బయటకు వచ్చాడు.

చంద్రం భార్య జానకి నిలబడి వుంది.

"ఎంత పిలిచినా ఆయన లేవటం లేదండి. దబ్బున రండి" అంటూ ఏడుస్తోంది...

ఇద్దరూ కలిసి వెళ్ళేసరికి చుట్టుప్రక్కల జనమంతా యింట్లో గుమిగూడి ఉన్నారు. హరిదాసు రంగయ్య కూడా వున్నాడు.

డాక్టరుగారు చంద్రాన్ని పరీక్ష చేశాడు. ఒక చీటీ రాసి యిస్తూ, "ఈ ఇంజక్షన్లు తీసుకురండి" అని అన్నాడు.

జానకి గోడ వంక చూసింది. చంద్రం టెరిలిన్ ప్యాంట్ చొక్కాలేవు. ప్రక్కన మేకుకు తగిలించిన గడియారం కూడా లేదు. మంచం క్రింద పెట్టుకున్న తన బట్టల పెట్టె వంక చూసింది. అది కూడా లేదు.

"ఎవరో సామానులన్నీ ఎత్తుకు పోయారురోయ్" అంటూ పెద్ద పెట్టున ఏడ్చింది.

"ఆ విషయం తరువాత చూసుకోవచ్చు. ముందు ఇంజక్షన్ తీసుకురా" అంటూ పరాత్పరరావు గద్దించాడు.

ఆ పిల్ల పరుగు పరుగున కాంతయ్య ఇంటికి వెళ్లింది. అప్పటికే కాంతయ్యకు ఈ వార్త తెలిసింది. మొన్ననే జీతం ఇచ్చేసినట్టుగా ఖాతాలో జమకట్టాడు.

"ఇంజెక్షన్‌కి డబ్బు కావాలి" అని జానకి అడిగింది.

"డబ్బా మొన్ననే జీతం తీసుకున్నాడు. నిన్నటి బేరం తాలూకు డబ్బు కూడా ఇవ్వలేదు."

"ఆయన జీతం తీసుకోలేదండి... నిన్న కూడా పచ్చడి మెతుకే తిన్నాం... మీ డబ్బు దుకాణం నుంచి తీసుకువచ్చి నిన్న సాయంకాలం అమ్మగారికి

ఇచ్చేశారట... అమ్మగారు పెట్టిన టిఫిను తిన్నాను. చాలా బాగుంది. రాత్రికి అన్నం అక్కర్లేదని అన్నారండి."

కాంతయ్య మనస్సులో పాములు బుసకొట్టాయి. తను ఇంటి దగ్గర లేనప్పుడు చంద్రం, తన భార్య ఎంతసేపు ఒంటరిగా వున్నారో! తను ముసలివాడు, వాళ్ళు ఇద్దరూ పడుచువాళ్ళు... సుశీలని నమ్మచ్చా!

"త్వరగా రండి" అని జానకి బ్రతిమాలుతోంది.

"సరే పద, అవన్నీ తరువాత చూసుకోవచ్చు" అంటూ కాంతయ్య బయలుదేరాడు. చంద్రం ఇంటికి వచ్చాడు. అప్పటికే ధర్మయ్య కూడా అక్కడికి వచ్చాడు.

"ఇంజక్షన్లు తెప్పించనా" అని కాంతయ్య అడిగాడు.

పరాత్పరరావు ఇటువంక చూడకుండా "ప్రాణం లేదు" అని అన్నాడు.

జానకి చాపచుట్టలాగా విరుచుకొని పడిపోయింది.

కాంతయ్య మనస్సులోనే 'అమ్మయ్య' అని అనుకున్నాడు.

అందరికీ దూరంగా ధర్మయ్య నిలబడి వున్నాడు. పరాత్పరరావు దగ్గరకు రాగానే,

"ఎల్లా జరిగింది?" అని అడిగాడు.

"ఒకపూట వుంటే ఒక పూట తినడానికి లేదు. నిన్న కాంతయ్య భార్య పెట్టిన టిఫిన్ తిన్నాడుట... అది ఎప్పటిదో ఏమో!... అసలే గుండెజబ్బు మనిషి!'

ధర్మయ్య ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు.... కనుసన్నలతోనే కాంతయ్యను పిలిచాడు.

ముగ్గురూ జనానికి రవ్వంత దూరంగా నిలబడ్డారు. "చంద్రానికి నీ భార్య విష ప్రయోగం చేసిందని, దానివల్ల అతను మరణించాడని డాక్టరుగారు చెబుతున్నారు. ఏం చేద్దాం?"

కాంతయ్యకు ముచ్చెమటలు పోశాయి. నోట మాట రావడం లేదు. మహా ప్రయత్నం మీద ఒక్కటే మాట అన్నాడు.

"ఎంత?" అని అన్నాడు.

ధర్మయ్య జాలిగా ముఖం పెట్టి "పది" అని అన్నాడు.

కాంతయ్య ఏడుపు మొగం పెట్టి "కొంప గుండం అయిపోతుంది" అని అన్నాడు.

ధర్మయ్య ఇంకా జాలిగా "ఇంకా ఆలోచిస్తూ నుంచుంటే నీ పరువూ, నీ పెళ్ళాం పరువూ బజారు పాలు, కోర్టు పాలు అవుతుంది. చెయ్యిదాటిన తరువాత ఎవ్వరం ఏం చెయ్యలేము."

కాంతయ్య 'సరే' అంటూ లేచి "మరి మిగతా ప్రయత్నాలు?" అని అడిగాడు.

ధర్మయ్య తడుముకోకుండా వెంటనే సమాధానం చెప్పాడు "పైకం అందిన వెంటనే."

డబ్బు కోసం కాంతయ్య వెళ్ళాడు.

ఎవరో చంద్రం వంక చూసి "రాయి లాంటి మనిషమ్మ" అని అంటూంటే పరాత్పరరావు అందుకుని,

"గుండె జబ్బు వాళ్ళు అలాగే కనిపిస్తారు" అని అన్నాడు. డాక్టరు గారి మాటను ఎవరూ కాదనలేదు.

చంద్రానికి నా అనే వాళ్ళు ఎవ్వరూ లేరు. గాలికి ధూళికి పెరిగి ఈ ఊరు వచ్చాడు. ధర్మయ్య కంటపడ్డాడు. అంటే కాంతయ్య దగ్గర నౌకరికి పెట్టాడు. అనాథ ఆశ్రమంలో పెరుగుతున్న జానకిని ఇచ్చి పెళ్ళి చేయించాడు.

అందుకే అతనిని ఊరు చివరిదాకా సాగనంపడానికి ఎవరూ సిద్ధం కాలేదు. ఎవరికి వారు రవ్వంత సేపు చోద్యం చూశారు. ఎవరి దోవను వారు వెళ్లిపోయారు.

కాంతయ్య పదివేలు తీసుకు వచ్చి ధర్మయ్యకు యిచ్చాడు. అతనేం మాట్లాడలేదు. పైకి మాత్రం 'రంగా కావేటి రంగా' అని అన్నాడు....

డాక్టరుగారికి మూడువేలు, ధర్మయ్యకు నాలుగు, జానకికి మూడు వేలు గప్‌చిప్‌గా పంపకాలు అయ్యాయి.

ఇంజక్షనుకు డబ్బు అడిగితే కసిరిన కాంతయ్య ఏడుస్తూ తన చేతిలో అంత డబ్బు పెడుతూవుంటే ఆ పిల్లకు అంత దుఃఖంలోను ఆశ్చర్యం కలిగింది.

"పోయిన వాళ్ళతో మనం పోలేము గదా. గుండె రాయి చేసుకుని బ్రతకాలి ఎప్పుడూ" అని ధర్మయ్య అంటూంటే ఆ పిల్ల శోకమూర్తిగా మారిపోయింది.

శవాన్ని కారులో పడుకోపెట్టారు. "అన్ని అక్కడే శ్మశానంలో చేద్దాం. చిన్న పిల్ల ఇవన్నీ చూస్తే గుండె చెరువైపోతుంది" అంటూ ధర్మయ్య అంటే అందరూ సరేనన్నారు.

శ్మశానంలో ఆగకుండా కారు సరాసరి పట్టణంలో మెడికల్ కాలేజి హాస్పిటల్ దగ్గర ఆగింది.

పరాత్పరరావుగారు లోపలికి వెళ్ళి ఎవరితోనో మాట్లాడి వచ్చాడు. చంద్రం శవాన్ని లోషన్‌తో నింపిన ఒక పెద్ద తొట్టెలో జారవిడిచారు. వైద్య నేర్చుకుంటున్న ఒక విద్యార్థి చంద్రాన్ని చూసి,

"గుడ్ స్పెసిమన్- హెల్తీ స్పెసిమన్" అని అన్నాడు.

ధర్మయ్య, రంగయ్య, పరాత్పరరావు కారు దగ్గరకు తిరిగి వచ్చారు.

ధర్మయ్య "ఎంత?" అని అడిగాడు.

డబ్బు యిస్తూ డాక్టరు "మీకు నూట యాభై, నాకు వంద, రంగయ్యకు యాభై" అని అన్నాడు.

డబ్బు రొంటిన పెట్టుకుంటూ రంగయ్య "పరోపకారార్థం ఇదం శరీరం" అని అన్నాడు.

ధర్మయ్య "రంగా కావేటి రంగా" అని రంకె పెట్టాడు.

కారు పల్లె దిక్కుగా పరుగెత్తింది.